
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 16 సెప్టెంబరు 2025



అలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి విజయానంద్

- శ్రీసిటీ భూసేకరణలో అడ్డంకులు తొలగించాలి
- పులికాట్ పూడికతీత పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలి
- సీఎం చంద్రబాబును కోరిన కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లా అభివృద్ధికి నిధులు కావాలి

తిరుపతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి నిధులు కావాలంటూ సీఎం చంద్రబాబును కలెక్టర్ వెంకటేశ్వర్ అభ్యర్థించారు. అమరావతిలో సీఎం అధ్యక్షతన సోమవారం మొదలైన 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. శ్రీసిటీకి అదనంగా 2500 ఎకరాలు కేటాయించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూసేకరణ చేస్తున్నామని వివరించారు. అయితే, దీనికి సంబంధించి పలు కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. పులికాట్ సరస్సుకు సంబంధించి పూడిరాయి దొరువు వద్ద సముద్ర ముఖ ద్వారాలు పూడిపోవడంతో పూడికతీతకు రూ. 97 కోట్లు నిధులు విడుదలయ్యాయని, కానీ పనులు చేపట్టడంలో ఆలస్యం జరుగుతోందని సీఎంకు నివేదించారు. కలెక్టర్ అభ్యర్థనలకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అంతకు మునుపు తొలిరోజు నిర్దేశిత శాఖలపై జరిగిన చర్చ సందర్భంగా జిల్లాలో పథకాలు, కార్యక్రమాల అమలు తీరును సీఎం సమీక్షించారు. ముఖ్యంగా పారిశ్రామిక పెట్టుబడులు, పీ4 అమలు, సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

జిల్లా స్థూల ఉత్పత్తి రూ.20,160 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం నిర్దేశించిన జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యం రూ.1.08 లక్షల కోట్లు. తొలి త్రైమాసికంలో రూ.20.160 కోట్లు సాధించింది. వార్షిక పెరుగుదల రేటు లక్ష్యం 18.77 శాతం కాగా.. మూడు నెలల్లో 18.55 శాతం సాధించింది. జీడీపీ లక్ష్య సాధనలో జిల్లా 17వ స్థానంలో వుంది.

వ్యవసాయ ఉత్పత్తుల్లో 13వ స్థానం

వ్యవసాయ రంగ ఉత్పత్తుల విలువ లక్ష్యం రూ.19,487 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనికిగానూ మొదటి మూడు నెలల్లో జిల్లా రూ.2,458 కోట్లు సాధించి 13వ స్థానంలో ఉంది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో జిల్లా 21 పాయింట్లతో స్కోర్ బోర్డులో సీ గ్రేడ్‌లో నిలిచింది. జిల్లాలపరంగా అట్టడుగున 26వ స్థానంలో ఉంది.

పారిశ్రామిక ఉత్పత్తుల విలువ రూ.7880 కోట్లు

జిల్లాలో పారిశ్రామిక ఉత్పత్తుల విలువ లక్ష్యం రూ. 43,068 కోట్లు. తొలి మూడు నెలలకు రూ.7990 కోట్లు సాధించి 24వ స్థానంలో ఉంది. స్కోర్ బోర్డు పరంగా 54 పాయింట్లతో బి గ్రేడ్ దక్కగా, జిల్లా 22వ స్థానంలో ఉంది.

పాల ఉత్పత్తి పెంచుకునేందుకు అవకాశం

2024-25లో పశు సంవర్ధక శాఖకు సంబంధించి ఉత్పత్తుల విలువ రూ.8028 కోట్లు. ఆ విలువ పరంగా జిల్లా 11వ స్థానంలో వుంది. పాల ఉత్పత్తిని పెంచుకునేందుకు అవకాశాలున్నాయని ప్రభుత్వం గుర్తించి.. ఆ దిశగా కృషి చేయాలని ఆదేశించింది.



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

స్వర్ణాంధ్రలో బి గ్రేడ్

స్వర్ణాంధ్రలో జిల్లాకు బి గ్రేడ్ దక్కింది. స్కోర్ బోర్డులో 60 పాయింట్లు వచ్చాయి.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

తిరుపతిలో ముగిసిన రెండు రోజుల సదస్సు ● నేడు స్వస్థలాలకు డెలిగేట్లు



వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, పురందేశ్వరి, రఘురామకృష్ణంరాజు, అయ్యన్న పాత్రుడు, ఓం బిర్లా, హరివంశ్‌నారాయణ్‌సింగ్, జకియాఖానం, గౌరు చరితారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ సాధించాలంటే.. మహిళల ఆర్థిక సాధికారత కీలకం. ఈ దిశగా అడుగులు వేసేలా రెండు రోజులపాటు తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సు దోహదపడింది. మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, సైబర్ భద్రత కల్పించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని సదస్సు చర్చించింది. ఈ సదస్సుకు లోక్‌సభ, రాజ్యసభ, 20కిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టసభల సాధికారత కమిటీలకు సంబంధించి 200మందికిపైగా వచ్చారు. తొలి రోజు సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరు కావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణంతో ఆయన పర్యటన రద్దయింది. రెండో రోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విడతల వారిగా సభ్యులు చర్చించారు. వాటిపరిష్కారానికి పలు తీర్మానాలు చేశారు. రెండో రోజైన సోమవారం మహిళా సాధికారత కమిటీలు చర్చించిన పలు తీర్మానాలను ఆమోదిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇక డెలిగేట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏపీ అసెంబ్లీ, జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేసింది. కాగా, దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల నుంచీ మహిళా ప్రతినిధుల బృందాలు వచ్చాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పార్లమెంటరీ మహిళా సాధికారత అధ్యక్షురాలు పురందేశ్వరి ఆయా బృందాల వద్దకెళ్లి యోగక్షేమాలతోపాటు బస, వసతి తదితరాలను గురించి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడించేలా సాధికారత సదస్సు నిర్వహించామని, అందుకు కారణం జిల్లా యంత్రాంగం పాత్ర చాలా కీలకమని స్పీకర్ ప్రశంసించారు. సదస్సు ముగిసిన వెంటనే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. ఉదయం తిరుమల శ్రీవారిని, మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వరుడిని పలువురు డెలిగేట్లు దర్శించుకున్నారు. తొలిరోజు రాత్రి చంద్రగిరి కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో తిరుపతి కమిషనర్ మౌర్య పర్యవేక్షణలో డెలిగేట్లకు ఆత్మీయవిందు ఇచ్చారు. కాగా, ప్రతినిధులు మంగళవారం ఉదయం వారి స్వస్థలాలకు బయలుదేరి వెళ్లనున్నారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం రాత్రి కమిషనరు మౌర్య ఆధ్వర్యంలో అతిథులకు విందు

రేపు తిరుచానూరు స్టేషన్‌కు

తొలి రైలు

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు తొలి రైలు వచ్చే సమయం ఆసన్నమైంది. మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి బుధవారం ఉదయం 11.30 గంటలకు తిరుపతి-రేణిగుంట మధ్యలోని తిరుచానూరు నూతన రైల్వే స్టేషన్‌కు చేరుకోనుంది. అక్కడ నుంచి అదేరోజు సాయంత్రం 6.40 గంటలకు తిరుగుప్రయాణం కానుంది. అదేవిధంగా ఈనెల 23, 30 తేదీల్లోనూ ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు తిరుచానూరుకు రాకపోకలు సాగించనున్నట్టు రైల్వేవర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్ మీదుగా తిరుచానూరు స్టేషన్‌కు చేరుకునే అవకాశం ఈ రైలు ద్వారా ప్రయాణికులకు కలగనుంది. తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను చదలవాడ విద్యా సంస్థల సమీపంలో నిర్మించారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సభ్యులు మధ్యాహ్నం 12 గంటలకు అన్నమయ్య భవనంలో సమావేశం జరుగుతుంది. ప్రధానంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లపైనే చర్చ జరుగనుంది. వాహనసేవలను వీక్షించేందుకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనసేవల నిర్వాహణ వంటి వివిధ అంశాలపై చర్చించనున్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. సాధారణంగా ఏడాదిలో ఉగాది, వైకుంఠ ఏకాదశి, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాల ముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలోనే ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.


19న పద్మావతి వర్సిటీలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈనెల 19వ తేదీన ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎంబీఏ విభాగంలో సంప్రదించవచ్చు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌ను చూడవచ్చునని పద్మావతి వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

1408మంది కొత్త పంతుళ్లు

- డీఎస్సీ విజేతల జాబితా ప్రకటించిన విద్యాశాఖ
- శిక్షణ అనంతరం విధుల్లో చేరనున్న టీచర్లు
- అభ్యంతరాల స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లో అవకాశం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాజా డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408మంది (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది.ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది.దరఖాస్తుల స్వీకరణతో ఈ ఏడాది ఏప్రిల్ 20న మొదలైన ప్రక్రియ పలు దశలు సాగి ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408 అభ్యర్థులు (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించినట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటించింది.ఫైనల్ సెలక్షన్ జాబితాను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌తో పాటు చిత్తూరు డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లోని 84989 91250 నెంబరులో సంప్రదించాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. వివిధ కారణాలతో మిగిలిన 70 పోస్టులను వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. నూతన ఉపాధ్యాయులకు దసరా సెలవుల సమయంలో అంటే 22 నుంచి 29వ తేది వరకు ఎనిమిది రోజుల పాటు ట్రైనింగ్ కార్యక్రమం చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తారు. బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు నిజాయితీ, నిబద్ధత, అంకితభావతో సేవలందించేలా వారికి సూచించనున్నారు. ట్రైనింగ్ సమయంలో కౌన్సిలింగ్ నిర్వహించి, ప్లేస్‌మెంట్ ఆర్డర్ (ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ ఆర్డర్) జారీ చేయనున్నారు. ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి కాగానే నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంది.



యాజమాన్యాల వారీగా భర్తీ చేసిన పోస్టులు

యాజమాన్యం	నోటిఫైడ్ పోస్టులు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ప్రభుత్వ/లోకల్‌బాడీ	1312	1254	58
మున్సిపాలిటీ	64	57	7
మున్సిపల్ కార్పొరేషన్	97	92	5
ట్రైబల్ వెల్ఫేర్/ఆశ్రమ	5	5	0
మొత్తం	1478	1408	70

● సబ్జెక్టులు/పోస్టుల వారిగా...

సబ్జెక్టు/పోస్టు	నోటిఫైడ్ పోస్టులు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ఎస్ఏ(ఎల్)ఇంగ్లీష్	104	102	2
ఎస్ఏ(ఎల్)హిందీ	17	16	1
ఎస్ఏ(ఎల్)తెలుగు	33	33	0
ఎస్ఏ(ఎల్)ఉర్దూ	4	2	2
ఎస్ఏ(ఎల్)తమిళం	1	-	1
ఎస్ఏ(ఎన్ఎల్)బయాలజీ	60	59	1
ఎస్ఏ(ఎన్ఎల్)బయాలజీ (త)	3	2	1
ఎస్ఏ(ఎన్ఎల్)బయాలజీ (ఉ)	1	1	0
ఎస్ఏ(ఎన్ఎల్)మ్యాథమెటిక్స్	28	27	1
ఎస్ఏ(ఎన్ఎల్)మ్యాథమెటిక్స్(త)	2	1	1
ఎస్ఏ(ఎన్ఎల్)మ్యాథమెటిక్స్(ఉ)	1	1	0
ఎస్ఏ(ఎన్ఎల్)పీడీ	86	86	0
ఎస్ఏ(ఎన్ఎల్)ఫిజికల్ సైన్స్	29	29	0
ఎస్ఏ(ఎన్ఎల్)ఫిజికల్ సైన్స్(త)	1	-	1
ఎస్ఏ(ఎన్ఎల్) సోషియల్ స్టడీస్	118	117	1
ఎస్ఏ(ఎన్ఎల్)సోషియల్ (త)	5	5	0
ఎస్ఏ(ఎన్ఎల్)సోషియల్ (ఉ)	7	5	2
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	891	885	6
ఎస్జీటీ (తమిళం)	7	5	2
ఎస్జీటీ(ఉర్దూ)	80	32	48
మొత్తం	1478	1408	70

టీటీడీ నుంచి రాజగోపాల్ రిలీవ్

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆల్ ప్రాజెక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్, శ్వేత ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ఉన్న రాజగోపాల్ సోమవారం టీటీడీ నుంచి రిలీవ్ అయ్యారు. గత ప్రభుత్వంలో ఆయన డిప్యుటేషన్‌పై టీటీడీకి వచ్చిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో తాత్కాలికంగా టీటీడీ తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చినట్టు సమాచారం. ఇక, దీంతో పాటు టీటీడీలో డిప్యుటేషన్‌పై వచ్చి ఇప్పటికీ కొనసాగుతున్న మరికొంతమంది అధికారులను కూడా టీటీడీ నుంచి పంపించే దిశగా ఇప్పటికే ఉన్నతాధికారులు ఫైల్‌ను సిద్ధం చేసినట్టు సమాచారం. కాగా, బ్రహ్మోత్సవాల ముందు ఈ అధికారులను కదిలించే ప్రక్రియ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రొ కబడ్డీ లీగ్ అంపైర్‌గా వెంకటగిరి మహిళ



శ్రీదేవి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 9వ బెటాలియన్‌కు చెందిన కోమటి రవికుమార్ భార్య శ్రీదేవి ప్రొ కబడ్డీ లీగ్ అంపైర్‌గా ఎంపికయ్యారు. ఆగస్టు 29 నుంచి నవంబరు 1వ తేదీ వరకు వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ నగరాల్లో జరగనున్న 12వ సెషన్ ప్రొ కబడ్డీ లీగ్ పోటీలకు శ్రీదేవి అంపైర్‌గా వ్యవహరించనున్నారు.

బాధితులకు సీఎం సహాయనిధి అందజేత


బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన పలువురికి రూ.27.50 లక్షల సీఎం సహాయనిధిని ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పంపిణీ చేశారు. రఘునాథ్ రిసార్ట్‌లోని పార్టీ కార్యాలయంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు తమ అనారోగ్య సమస్యలను తన దృష్టికి తీసుకురాగా సీఎం చంద్రబాబుకు నివేదించామన్నారు. ఆయన ఈమేరకు సహాయాన్ని విడుదల చేశారన్నారు. కష్టకాలంలో తమను ఆదుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆ దారిలో దుర్వాసన భరించలేం!


రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలు

భాకరాపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పీలేరు- తిరుపతి జాతీయ రహదారిలోని చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సిందే. నిత్యం వందలాది వాహనాలు ఈమార్గంలో వెళ్తుంటాయి. చుట్టుపక్కల ప్రజలు వెళుతుంటారు. చికెన్ సెంటర్ల కోళ్ల వ్యర్థాలన్నీ చెరువు కట్టపై పడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. వీటి గురించి పట్టించుకునే వారు లేరు. సమీపంలోని గంగమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కావున అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీవనోపాధి రుణసాయంతో ఎదగాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు

రామచంద్రాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రతి ఇంటి నుంచి ఒక్కరు పారిశ్రామికవేత్తగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. సీరామాపురం గ్రామ సమాఖ్య, పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ రుణాల ద్వారా ప్రతి మహిళ 35శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. మహిళా సంఘాల తమ జీవనోపాధి కోసం రుణాలు పొంది ఆవులు, గేదెలు, మేకలు తదితర వాటిని కొనుగోలు చేసి ఆదాయం ఆర్జించాలని సూచించారు. వెటర్నరీ డాక్టర్ జయకిషోర్, ఏపీఎం గురుమూర్తి, సీసీ సుధాకర్, వీవో వాణి, స్వయం సహాయకసంఘ మహిళలు పాల్గొన్నారు.

ముందస్తు క్యాన్సర్ పరీక్షలు



పాకాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దామలచెరువు సచివాలయంలో పింక్ బస్సు క్యాంపులను నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు నివారణపై అవగాహన కల్పించారు. పింక్ బస్సులో స్విమ్స్ వైద్య బృందం డాక్టర్ కె.నాగరాజు, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ లలిత్‌ల పర్యవేక్షణలో ముందస్తు క్యాన్సర్ పరీక్షలను చేశారు. డాక్టర్ అరవింద్ కుమార్, డాక్టర్ లక్ష్మీ పూజిత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాపోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు జడ్పీహైస్కూల్‌లో హెచ్‌ఎం సుమతమ్మ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా పోటీలను ఎంఈవో బాబ్జీ సోమవారం ప్రారంభించారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మొదలైన క్రీడలను నిర్వహించారు. మహాప్రస్థానం వ్యవస్థాపకుడు అనిల్ కుమార్ రూ.10వేల విలువచేసే షీల్డ్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లింగయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఎయిడ్స్‌పై కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటు వ్యాధి కాదన్నారు. రక్తమార్పిడి, లైంగిక సంబంధాల వలన వస్తుందన్నారు. దీనికి మందులు లేవని, కావున దూరంగా ఉండాలన్నారు. వైద్యులు మోహన్ సాయి, స్వప్నలత, కోర్ సంస్థ ప్రతినిధులు తులసీ, సుభాషిణి, మేఘన, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

భాకరాపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ అన్నారు. భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్బాయికి 25 సంవత్సరాలు, అమ్మాయికి 21 సంవత్సరాలు పూర్తయిన వారికి మానసికంగా, శారీరకంగా ఎదుగదల ఉంటుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడడం వల్ల ప్రతి వేయి మంది పురుషులకు 930 మాత్రమే స్త్రీలు ఉన్నారన్నారు. హెచ్‌ఎం శివకుమార్, వైద్యాధికారి తేజస్విని, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో నెరబైలు విద్యార్థుల ప్రతిభ


విజేతలతో ప్రధానోపాధ్యాయులు

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి); మండల స్థాయిలో సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలను ఎమ్డీవోలు బాల సుబ్రమణ్యం, సతీష్ బాబులు ప్రారంభించారు. వాలీ బాల్ అండర్ 14 విభాగంలో, వాలీబాల్ విభాగంలో నెరబైలు స్కూలు విజేతగా నిలిచింది. బాలికల కబడ్డీలో ఉస్తికాయల పెంట హైస్కూల్ జట్టు గెలుపొందింది. వాలీబాల్ బాలికల విభాగంలో ఉస్తికాయల పెంట జట్టు విజేతగా నిలిచింది.

పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడుకుందాం

భాకరాపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంచుకుని పర్యావరణాన్ని కాపాడుకుందాం అని గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ గిరి కుమార్ రెడ్డి అన్నారు. భాకరాపేట గీతాంజలి ఉన్నత పాఠశాలలో గ్రీన్ బ్లోజం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణంతో విద్యార్థులు అనుబంధాన్ని పెంచుకోవాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత పెరుగుతుందన్నారు. హెచ్‌ఎం స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నాగేంద్రబాబు మృతదేహం

భాకరాపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి-మదనపల్లె మార్గంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం మేరకు అన్నమయ్య జిల్లా మహల్‌రాజుపల్లె పంచాయతీ ఎగువరాజుపల్లెకు చెందిన నాగేంద్ర బాబు(30) తిరుపతిలో లిఫ్ట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి స్వగ్రామం నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎడంవారిపల్లె సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో నాగేంద్రబాబు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వాహనచోదకుడ రవికి కాలు విరిగింది. అతన్ని తిరుపతికి తరలించారు. నాగేంద్ర బాబు మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



చంద్రగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రగిరి జూనియర్ కళాశాల లెక్చరర్ రవి ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన తిరుపతి ఆఫీసర్స్ క్లబ్‌లో అధ్యాపకుల సంఘ ఎన్నికల్లో రవి అధ్యక్షుడుగా, నాగరాజు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మరో పది మంది కార్యవర్గంలో వివిధ హోదాల్లో ఎన్నుకున్నారు. రవిని ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు

తిరుచానూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు దర్శించుకున్నారు. ఆలయం వద్ద తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి కూడా దర్శించుకున్న వారిలో ఉన్నారు.

అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోండి: సుగుణమ్మ


ఎస్పీ సుబ్బరాయుడికి పుష్పగుచ్ఛమిస్తున్న సుగుణమ్మ,నాయకులు

తిరుపతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడిని ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి ప్రశాంతతకు పెద్దపీట వేయాలని కోరారు. అదేవిధంగా తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఎస్పీని కలిసిన వారిలో కోడూరు బాలసుబ్రమణ్యం, మన్నెం శ్రీనివాసులు, బుల్లెట్ రమణ, అముదాల తులసిరామ్, సూర్యకుమారి, రజని, అనిత, బీజీ ఆనంద్ యాదవ్, పెరుమాళ్ మధు, మునిశేఖర్‌రాయల్, మునిరామయ్య, విశ్వనాథం, ప్రమోద్ పాల్గొన్నారు.

పురందేశ్వరికి టీడీపీ నేతల అభినందన



తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రెండురోజుల పాటు జరిగిన మహిళా సాధికారత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకుగాను సాధికారత చైర్మన్ పురందేశ్వరిని స్థానిక టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పుష్పావతి యాదవ్, క్లస్టర్ నాయకులు బుల్లెట్ రామణ, బి.జి.కృష్ణ యాదవ్, నాయకులు పెరుమాళ్ మధు, విజయలక్ష్మి, నందగోపాల నాయుడు, సుబ్బు, మునీంద్ర కలిసి అభినందించారు. మహిళా సాధికారతకు చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధికి కలిసి పనిచేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

గంగమ్మను దర్శించుకున్న ఎస్పీ దంపతులు

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) తాతయ్యగుంట గంగమ్మను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు మురళీ స్వామితో పాటు చైర్మన్ అమ్మవారి తీర్థ ప్రసాదాలు ఎస్పీ దంపతులకు అందజేశారు. అమ్మవారి ఆలయ విశిష్టత, ప్రాశస్త్యం గురించి వారు వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గుణ, భాగ్యవల్లి, మధులత, సుబ్రమణ్యం, శ్యామల, విమల, వరలక్ష్మి, చంద్రశేఖర్, రుద్రకిషోర్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 85 ఫిర్యాదులు


పిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 85 మంది బాధితులు సమస్యలపై వినతులిచ్చారు. వీటిలో ప్రధానంగా భూ సమస్యలు, ఆర్థిక పరమైన అంశాలు, భార్యాభర్తల గొడవలు, భూ ఆక్రమణలు, ఘర్షణలు వంటి ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు పర్యవేక్షణలో సీఐలు, సిబ్బంది సమస్యలు తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు దగ్గర్లోని పోలీసు స్టేషన్లకు వెళ్ళి పిర్యాదు చేయాలని కోరారు.

స్వీయ రక్షణ పద్ధతులపై విద్యార్థులకు శిక్షణ

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రాణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్వీయ రక్షణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం ఇస్తున్నారు. ఆమె మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలకు, వికలాంగులకు స్వీయరక్షణ ఆవశ్యకత గురించి వివరించారు. ప్రస్తుత రోజుల్లో మహిళలపై జరుగుతున్న అకృత్యాల నుంచి రక్షణ పొందడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షకుడు రత్నాకర్ మాట్లాడుతూ ఆడపిల్లల స్వీయ రక్షణకే కాకుండా ఈ శిక్షణ ద్వారా భవిష్యత్తులో ఉద్యోగాలలో రిజర్వేషన్ పొందే అవకాశం కూడా ఉందని తెలియజేశారు. ఈ శిక్షణలో 85 మంది బధిర విద్యార్థినులు పాల్గొన్నారు.

ధాన్యం రైతుల దైన్యం

వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు


కొనేవారి కోసం సంజీవరాయపురం రైతుల నిరీక్షణ

రామచంద్రాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక ధాన్యం రైతుల దిగాలు చెందుతున్నారు. వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి తమను దగా చేస్తున్నారని వీరు వాపోతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 700 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరానికి 20 నుంచి 24 బస్తాల దిగుబడి వచ్చింది. బుడ్డల రకం 80కేజీల బస్తాను వ్యాపారులు రూ.1,300కి కొంటున్నారు. దీంతో పెట్టుబడి కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. .గత రబీసీజన్‌లో ఇదే బుడ్డలు రూ.1,650 పలుకగా ఇప్పుడు బస్తాపై రూ.350 తగ్గించి చెల్లిస్తుండటంతో నష్టపోతున్నామని బలిజపల్లికి చెందిన జగనాథం చెప్పారు. ధాన్యం కొంచెం తేమగా ఉంటే బస్తాకు మరో ఐదు కేజీల చొప్పున ఎక్కువ తూకాలు వేసుకుంటున్నారు. సన్నరకం ధాన్యం 50 కేజీల బస్తా ధర గత రబీలో రూ.1,800కు అమ్ముడుపోగా ఈ ఖరీఫ్ సీజన్‌లో రూ.1,100కుకూడా కొనుగోలు కూడా చేయడంలేదని గంగిరెడ్డిపల్లికి చెందిన రైతు మధు ఆందోళన చెందుతున్నారు. లారీ ధాన్యం ఉంటే తప్ప కొనడానికి వ్యాపారులు రాకపోవడంతో నాలుగైదు రోజులుగా వరికుప్పల వద్ద రైతులు జాగరణ చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మామిడి కూడా ఏటేటా నట్టేట ముంచుతోందంటున్నారు.. వరికొనుగులుకు ప్రభుత్వం నుంచి తమకు అనుమతులు రాలేదని వ్యవసాయశాఖాధికారి మమత తెలిపారు.

అంబేడ్కర్ లా కళాశాల విద్యార్థుల సత్తా


అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి మ్యూట్‌కోర్ట్ ఫలితాల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి తెలిపారు. గుజరాత్‌లో సంవిధాన్ పేచర్చా-2కే25 పేరిట నిర్వహించిన కార్యక్రమానికి(మ్యూట్‌కోర్ట్) 110 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పోటీపడ్డారన్నారు. తమ విద్యార్థులు చిన్మయి, సాహితి, హర్షిత మొదటి స్థానంలో నిలిచి రన్నరప్ ప్రైజ్‌తో పాటు క్యాష్ అవార్డుని పొందారన్నారు. రీసెర్చ్ టెస్ట్‌లో విద్యార్థి హర్షిత ద్వితీయ బహుమతి సాధించిందన్నారు. లా కమిషన్ గౌరవ చైర్‌పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిసింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయకుమార్ చేతులమీదుగా అవార్డును విద్యార్థులు అందుకున్నారన్నారు.

బాధిత రైతులకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న నాని

తిరుచానూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండల పరిధిలో ఏనుగుల దాడి వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే నాని సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. రైతుల ఆవేదనను డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి 26మమంది రైతులకు రూ.3,75 లక్షల మంజూరు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్; ఎమ్మెల్యే నానిలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

మోక్షగుండం సేవలు ఆదర్శనీయం


మోక్షగుండం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంతోషరావు తదితరులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : సమాజానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఆదర్శనీయమని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అన్నారు. ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం మోక్షగుండం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్ అతిథిగృహ ప్రాంగణంలో విగ్రహాన్ని అవిష్కరించారు. అనంతరం సంతోషరావు మాట్లాడారు. ఏపీఎస్పీడీసీఎల్ పూర్వపు సీఎండీలు కలాల రంగనాథం, పంగూరు గోపాల్‌రెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ పి.అయూబ్‌ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్ ఎన్.శోభా వాలెంటీనా, జనరల్ మేనేజర్లు రామచంద్రరావు, కృష్ణారెడ్డి, రమేష్, ప్రసాద్, సురేంద్రరావు, మురళీకుమార్, వెంకటరాజు, నాగరాజు, బాలాజీ, రమేష్, జయప్రకాష్, మునిప్రసాద్ పాల్గొన్నారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సూళ్లూరుపేట - చెన్నై మార్గంలో అక్కంపేట రైల్వేస్టేషన్ సమీపంలో 74/29-31 కిలోమీటరు మధ్య సుమారు 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం పడి ఉందంటూ రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృత్యుంజయుడికి వేదోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరా లయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించారు

తిరుమలలో ఎస్పీ విస్తృత తనిఖీలు


అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం తిరుమలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. గరుడవాహనం రోజున వేలాది తరలివచ్చే భక్తుల మధ్య తోపులాటలు లేకుండా క్యూలైన్లను పెంచే దిశగా టీటీడీ సీవీఎస్వో మురళికృష్ణ, వీఎస్వోలు రాంకుమార్, సురేంద్రతో చర్చించారు. మాడవీధులతో పాటు ఏటీజీహెచ్, తిరుమలనంబి, కృష్ణతేజ, నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్, శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ సర్కిల్, అన్నదానం, వరాహస్వామి వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. భద్రతా చర్యలపై సూచనలు చేశారు.

డెయిరీ టెక్నాలజీ ఏడీకి అభినందన


గంగరాజును సన్మానిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా నియమితులైన ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగరాజును సోమవారం ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘ నాయకులు అభినందించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.నాగేశ్వరరావు నేతృత్వంలో దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. నాయకులు ఉత్తరాది విజయ్, వెంకట్‌యాదవ్, ఏజ్రా, సురేష్, ముస్తఫా, గిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


డీకే అరుణ, అఖిలప్రియ, శిరీష, చరిత, శ్రావణి

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా, తెలంగాణ ఎంపీలు రవిచంద్ర, డీకే అరుణ, ఎమ్మెల్యేలు భూమ అఖిలప్రియ, గౌతు శిరీష, గౌరు చరిత, బండారు శ్రావణి, రెడ్డప్పగారి మాధవిరెడ్డి, ఇండియన్ క్రికెటర్ రవీంద్ర జడేజా సతీమణి, ఎమ్మెల్యే రవిబా జడేజా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఆర్టీసీ బస్సుల తనిఖీ ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా అలిపిరి బాలాజీ బస్టాండులో ఆర్టీసీ బస్సుల చివరి దశ తనిఖీలు సోమవారం ఉదయం డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఘాట్‌లో నడుస్తున్న 410 బస్సుల కండిషన్‌ను మూడు నెలలుగా నాలుగు దశల తనిఖీలు పూర్తి చేశారు. ఐదో దశ తనిఖీలు మొదలయ్యాయి. ఈనెల 23వ తేదీ వరకు తనిఖీలు కొనసాగించనున్నారు. నిపుణులు ప్రతి బస్సునూ క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఘాట్ ఎలిజిబుల్ ముద్ర వేస్తున్నారు. చిన్న సమస్య గుర్తించినా పక్కనపెట్టేస్తున్నారు. భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు జాగ్రత్త చర్యలు చేపట్టామని డీపీటీవో వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిప్యూటీ సీఎంఈ బాలాజీ, అలిపిరి డీఎం హరిబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మారిషస్ ప్రధానికి స్వాగతం



మారిషస్ ప్రధానికి స్వాగతం పలుకుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఒకరోజు పర్యటన నిమిత్తం వచ్చిన మారిషస్ ప్రధాన మంత్రి నవీన్ చంద్ర రామ్గోళంకు సోమవారం ఘన స్వాగతం లభించింది. తిరుపతి విమానాశ్రయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కమిషనర్ జవహర్‌లాల్, అనంతపురం డీఐజీ పిమోసి బాజ్పేయి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ భరత్‌కుమార్‌రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన బ్రహ్మర్షి ఆశ్రమం, శ్రీవారి దర్శనార్థం ప్రత్యేక కాన్వాయ్‌లో బయలుదేరి వెళ్లారు.

టీటీడీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : టీటీడీలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యుడు బాణావత్ మునీంద్రనాయక్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఈ పోస్టులు భర్తీకి నోచలేదన్నారు. పోస్టుల భర్తీలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు 70 శాతం అవకాశం కల్పించాలని కోరారు. గిరిజన తాండాలు, కాలనీలలో గిరిజన గోవిందం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. టీటీడీ విద్యాసంస్థల్లో ఉచిత విద్య సీట్ల సంఖ్యను పెంచి పేదలకు అవకాశం కల్పించాలన్నారు. కమిటీ సభ్యురాలు సరస్వతమ్మ మాట్లాడుతూ తిరుపతి కేంద్రంగా ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు.

ఎస్వీ పాలిటెక్నిక్ టాపర్స్‌కు స్కాలర్‌షిప్



విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న అతిథులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ ఆధ్వర్యంలో ఎస్వీ పాలిటెక్నిక్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పదిమంది టాపర్స్‌కు స్కాలర్‌షిప్ అందజేశారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య రామకృష్ణారెడ్డి భవన్‌లో సోమవారం టేప్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. టేప్ సీనియర్ సివిల్ ఇంజినీర్ ఎస్.విజయభాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఏపీ వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సి.ఆర్.రాజన్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, గంగమ్మగుడి ఛైర్మన్ మహేష్‌యాదవ్ పాల్గొని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. టేప్ ప్రతినిధులు టి.వెంకటేశ్‌బాబు, టి.వెంకటరమణ, బి.షణ్ముగం, పి.నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, సందీప్, శివశంకర్‌రెడ్డి, బంగారయ్య, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

మిగులు ప్లాటుదారులకు న్యాయం చేస్తాం



ఆర్డీవో కార్యాలయం వద్ద శెట్టిపల్లి ప్లాట్ల బాధితులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లె భూముల్లో మిగిలిపోయిన ప్లాటుదారుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆర్డీవో రామ్మోహన్‌రావు హామీ ఇచ్చారు. తమకూ రెండు సెంట్ల స్థలం కేటాయించి ఆదుకోవాలని సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద మిగిలిపోయిన ప్లాటుదారులు ధర్నా నిర్వహించారు. గతంలో ప్రభుత్వం పత్రికల్లో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా అందరికీ న్యాయం చేయాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, శెట్టిపల్లి భూ బాధితుల పోరాట కమిటీ అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ, చినబాబు, శ్రావణ్, రాజశేఖర్, మధు మోహన్, అమ్ములమ్మ, కుప్పమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ముందస్తుగా ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల మొదటి ఘాట్ రోడ్డు నిర్మాణానికి సూచనలు, సలహాలు ఇచ్చిన విశ్వేశ్వరయ్య జ్ఞాపకార్థం తిరుమలలో నిర్మించే రోడ్లకు, భవనాలకు ఆయన పేరు పెట్టాలని కోరారు. టీటీడీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఇంజినీర్లకు అర్హత, అనుభవాన్ని బట్టి పదోన్నతులు కల్పించేలా పాలకమండలి చొరవ చూపాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

మంత్రి సవితమ్మపై విమర్శలు బాధాకరం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవితమ్మపై కురవ, కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న జబ్బల శ్రీనివాస్ విమర్శలు చేయడాన్ని ఆ సంఘం తిరుపతి జిల్లా నాయకులు తప్పుపట్టారు. ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ తిరుపతి పూర్ణకుంభం సర్కిల్‌లో వచ్చేనెల 5న భక్తకనకదాసు కాంస్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు శ్రీనివాస్ ప్రకటించడం పట్ల మండిపడ్డారు. అంతేగాక మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వలాభం కోసం పార్టీలు మారుతూ పబ్బం గడుపుకుంటున్న వ్యక్తులకు మంత్రిని విమర్శించే స్థాయి లేదన్నారు. తీరు మార్చుకోకపోతే బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎమ్మెల్యేకు జ్ఞాపిక బహూకరణ



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలవుతున్న సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ పథకాలతో తయారుచేసిన మెమెంటోను డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు బహూకరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలు అర్హులకు సకాలంలో అందుతున్నాయని ఆనందం పంచుకున్నారు.

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నేతలు



పురందేశ్వరితో మధుసూదన్ తదితరులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ నాయకురాలు దగ్గుపాటి పురందేశ్వరిని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెలోని సేవాభావం, పారదర్శక రాజకీయ ధోరణి, ప్రజల పట్ల అంకితభావం వంటి లక్షణాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. రాష్ట్రంలో పార్టీని ఉన్నత స్థానంలో నిలపడంలో ఆమె కృషి ఎనలేనిదన్నారు.

రేపు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న స్వర్ణకారుల సంఘ నాయకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక గాలివీధిలోని కాళికా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 17వ తేదీన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు స్వర్ణకారుల సంఘం నాయకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడుతూ మహోత్సవంలో భాగంగా విశ్వకర్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం విశ్వకర్మ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంతకుముందు ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఎం.కార్తీక్ ఆచారి, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శి శివాచారి, ఆర్.రమేష్, పళని, వెంకటేష్, బాబు, వాసు పాల్గొన్నారు.

బస్సుల పార్కింగ్, డిపో, స్టాండులకు..

ప్రత్యామ్నాయ స్థలాలివ్వండి

కలెక్టర్‌ను కోరిన ఆర్టీసీ ఉన్నతాధికారులు



సీబీఎస్‌లో జరుగుతున్న భవనాల కూల్చివేత పనులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండును స్థలాభావ సమస్య వెంటాడుతోంది. లాంగ్‌రూట్ బస్సులు ఇక్కడే పార్కింగ్ చేస్తుండటం, బస్సుల రాకపోకలు ఎక్కువగా ఉండటం, డిపో కోసం కొంతస్థలం కేటాయించడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ క్రమంలో దూర ప్రాంతాల బస్సులను బయట పార్కింగ్ చేసి, బయలుదేరు సమయంలో ప్లాట్‌ఫాం వద్దకు వచ్చేలా ఆలోచన చేస్తున్నారు. ఇందుకోసం దాదాపు రెండు ఎకరాల స్థలం అవసరమని భావిస్తున్నారు. అలాగే త్వరలో రానున్న ఐఎంఎస్(ఇంట్రా మోడల్ స్టేషన్) నిర్మాణం కోసం తిరుపతి డిపో, డీపీటీవో కార్యాలయాలను కూల్చివేయనున్నారు. అందుకే నగర శివారు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలు సమకూర్చుకోవడానికి సన్నాహాలు ప్రారంభించారు. తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల్లో ఎకరాల కొద్ది ఖాళీ స్థలాలున్నా ప్రజాప్రతినిధులు తిరస్కరిస్తున్నట్లు సమాచారం. చాలా దూరంగా కేటాయించడం వల్ల ప్రయోజనం ఉండదని అధికారులు భావిస్తున్నారు. దీనికితోడు శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు బస్టాండ్లు నేలమట్టం కానుండటంతో ఇంకో ఐదు ఎకరాల స్థలం అవసరం. దీనిపై ప్రజారవాణాధికారి జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం దీనిపై ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. నగరశివారు ప్రాంతాల్లో కేటాయిస్తే అటు ప్రయాణికులకు, ఇటు ఆర్టీసీకి సౌకర్యంగా ఉంటుందని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

హోరాహోరీగా మండల స్థాయి క్రీడా పోటీలు



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న హెచ్‌ఎం పరంధామనాయుడు

తిరుపతి(విద్య), సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్‌లో సోమవారం 69వ స్కూల్‌గేమ్స్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్ అండర్-14 బాలికల విభాగంలో ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ ప్రథమస్థానం, ఎంజీఎం స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో మాలవ్యాజి మున్సిపల్ హైస్కూల్ ప్రథమ స్థానం, ఎస్వీయూ క్యాంపస్ ద్వితీయస్థానాన్ని సాధించాయి. అండర్-17 వాలీబాల్ బాలికల విభాగంలో ఎస్వీయూ క్యాంపస్, ఎస్పీజేఎన్ఎం విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, బాలుర విభాగంలో నారాయణ స్కూల్, ఎస్పీజేఎన్ఎం స్కూల్ విద్యార్థులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో ఎంజీఎం, గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. బాలుర విభాగంలో ఎస్పీజేఎన్ఎం, శ్రీవారి హైస్కూల్ మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్నాయి. అండర్-17కబడ్డీ బాలికల విభాగంలో ఎంజీఎం, నారాయణస్కూల్ విద్యార్థులు తొలి రెండు స్థానాలను సాధించారు. అంతకుముందు హెచ్‌ఎం పరంధామనాయుడు, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి శశిధర్ పోటీలను ప్రారంభించి విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు కార్మికులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచులయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ రవి, బిల్డింగ్ వర్కర్స్ నేతలు కత్తి రవి, హరిబాబు, ఆదంబాబు, రత్నం, ఆనందరెడ్డి, బాషా, కొండయ్య, రాజారెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

యోధశ్రీకి స్వర్ణ పతకం



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖలో గత ఆదివారం జరిగిన 9వ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్ సబ్ జూనియర్ గర్ల్స్ అండర్ 32 కేజీల విభాగంలో స్థానిక ఉపాధ్యాయనగర్‌కు చెందిన యోధశ్రీ బంగారు పతకం సాధించింది. విశాఖ సిటీ పోలీసు కమిషనర్ శంకరబ్రాతబాగ్చి ఆమెను అభినందించారు. ఆ బాలికను సోమవారం తైక్వాండో కోచ్ ఎ.బాలకృష్ణ, ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఊకా విజయ్‌కుమార్ అభినందించారు.

జూపార్కును మరింత అభివృద్ధి చేస్తాం



జూపార్కులో మొక్కలు నాటుతున్న మల్లికార్జునరావు

మంగళం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ జూపార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు అన్నారు. సోమవారం ఆయన జూపార్కును సందర్శించారు. జూ అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలపై జిల్లా అటవీ శాఖ అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల జూలో జంతువులను సంరక్షించవచ్చునని తెలిపారు. శేషాచల అడవుల అభివృద్ధికి, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు ఆయన జూ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ సెల్వం, జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, జూ రేంజ్ ఆఫీసర్ జగదీష్, తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, జూ డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు : భూమన

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి సోమవారం అన్నారు. వైసీపీ హయాంలో ఆస్పత్రి నిర్మాణాలను చేపట్టడం జరిగిందని, అయితే ఏడాదిన్నర కాలంలో ప్రస్తుత పాలకులు 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఉద్యమిద్దాం



ఆటోడ్రైవర్లతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఉద్యమిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతి ఆటో కార్మికుడికీ రూ.15వేలు ఇస్తామని చెప్పారన్నారు. మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో చెప్పిన మేరకు ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు పురుషోత్తంరెడ్డి, గోపి, దీపకుమార్, లక్ష్మయ్య, లోకేష్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డీ రవి పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

తిరుపతి(విద్య), సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వివేకానంద కేంద్ర-తెలుగు ప్రాంత్ నిర్వహించిన రీల్స్ తయారీ (షార్ట్ వీడియో) పోటీలలో బహుమతులు సాధించారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం పేర్కొన్నారు. ప్రతిభచాటిన బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థులు లాస్య ఆనంద్, గీత, పరీక్‌ని డైరెక్టర్లు గిరిధర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సభల నిర్వహణకు అనుమతించండి



రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో విద్యార్థి సంఘాల సభలు, సమావేశాలకు అనుమతించాలని పలు విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ మేరకు పరిపాలనా భవనం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి నిరసన తెలిపారు. వీసీ అప్పారావుకు విన్నవించారు. అనుకూలంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు అశోక్, అక్బర్, రవి, ఏఐఎస్ఎఫ్ నేత ఉదయ్, ఎన్ఎస్‌యూఐ నేత మల్లికార్జున, జీఎన్ఎస్ నేత శివశంకరనాయక్, జైభారత్ విద్యార్థి సంఘ నేత భార్గవ్, కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామలో ఘనంగా ఇంజినీర్స్ డే



తిరుపతిరూరల్, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పలువురు అధ్యాపకులు పుష్పాంజలితో నివాళి అర్పించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థులకు లోగో క్రియేషన్, వర్కింగ్ మోడల్స్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వాసు, సివిల్‌హెడ్ బి.బాలకృష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుపతి(రవాణా), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. శ్రీగగన్ హైస్కూల్, శ్రీవిద్యా నికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, శ్రీపద్మావతి విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులను భాగస్వామ్యం చేసింది. హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, పాదచారుల నియమాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.

తిరుమల చేరుకున్న గవర్నర్ నజీర్



తిరుమల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. విధాత నిలయం(రచన)కు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించారు. రిసెప్షన్ అధికారులు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనానికి వెళ్లిన ఆయన భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ వ్యాన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ వ్యాన్ విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన టీవోల్ట్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15.94 లక్షల విలువైన మొంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్(ఈ-ఎస్‌సీవీ) వాహనాన్ని అందజేసింది. ఈమేరకు సోమవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంస్థ ప్రతినిధులు తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథానికి అందజేశారు.



శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో మూడు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,893
- తలనీలాలు సమర్పించినవారు: 24,604



గ్యాలరీల్లో 1.85 లక్షల మంది

- వాహన సేవలు వీక్షించే అవకాశం
- తప్పుడు ప్రచారానికి కౌంటర్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు
- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో 24 నుంచి జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల మంది భక్తులు కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముందన్నారు. రీఫిల్లింగ్ ద్వారా మరో 15 వేల మందికి కూడా వాహనసేవల దర్శనం లభిస్తుందన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా రోజుకు 435 బస్సులు నడుస్తున్నాయని, దీని ద్వారా రోజుకు సుమారు 1.60 లక్షల మంది భక్తులు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించవచ్చన్నారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించేలా వీలైంతన వరకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. తిరుపతిలో 23 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. గ్యాలరీల్లోకి చేరుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 4,200 మంది పోలీసులు, 1,500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా క్రౌడ్ మూవ్‌మెంట్, రద్దీ పాయింట్లను రియల్ టైం మానిటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. సీఎం, రాజ్యాంగపరమైన అధినేతలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. సోషల్ మీడియాలో తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వెంటనే కౌంటర్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు, వీఎస్వోలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 16 నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

పోస్టర్లు ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్, శాప్ చైర్మన్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, శాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 16వ తేదీ నుంచి యువతరంగ్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీయూలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అక్టోబరు 16 నుంచి యూనివర్సిటీ వేదికగా మూడు రోజులు డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులకు అంతర యూనివర్సిటీల సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వక్తృత్వ, సంగీత, నృత్య, థియేటర్ ఆర్ట్స్ వంటి 10 అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువ తరంగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యూనివర్సిటీ సాంస్కృతిక ఔన్నత్యాన్ని పెంపొందించ డానికి ప్రయత్నించాలన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ యూనివర్సిటీ క్రీడా, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ 40డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులు యువ తరంగ్‌లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పద్మావతి, మీడియా డీన్ పీసీ వేంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కో కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. మీ వేషాలు నా దగ్గర కాదు!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కని శానిటేషన్ వర్కర్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంత చదువుకున్నా.. ఎంత పరిజ్ఞానమున్నా సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మేవాళ్లే ఎక్కువ. వాళ్ల ఉచ్చులోపడి లబోదిబోమనే వాళ్లే. కానీ, తిరుపతికి చెందిన శానిటేషన్ వర్కర్ ఒకరు మాత్రం మీ వేషాలు నా దగ్గర కాదంటూ సోమవారం తనకు ఫోనుచేసిన అమ్మాయికి దీటుగా ఎదురు తిరిగారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన దొరరాజు మధుసూదనరాజు టీటీడీ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు 87459 85232 నెంబరు నుంచి వాట్సాప్ ఫోను వచ్చింది. వాట్సాప్ పిక్‌గా 'స్కాలర్‌షిప్ డిపార్టుమెంటు' అని ఉంది. మీ కుమారుడు రోహిత్ కుమార్ రాజుకు ప్రభుత్వం స్కాలర్ షిప్ కింద రూ.38,500 మంజూరు చేసిందంటూ ఓ యువతి చెప్పింది. మీకు ఫోనుపే ద్వారా జమ చేశామంటూ స్క్రీన్ షాట్ పెట్టింది. స్క్రీన్ షాట్‌లో ఆ మొత్తం జమ చేసినట్లుగా ఉంది. దీనికిగాను తమకు కమీషను కింద వెంటనే డబ్బు పంపాలని తొందర చేసింది. నీ అకౌంటులో రూ.మూడు వేలు ఉంది కదా.. దానిని పంపండని ఆమె ఒత్తిడి తెచ్చింది. ఈయన మాత్రం తన తన అకౌంటులో బ్యాలెన్సు చెక్ చేయగా, జమ కాలేదని తెలిసింది. మీరు డబ్బు పంపండి.. మళ్ళీ స్కాలర్ షిప్ అమౌంటుతో కలిపి మీకు పంపుతామంటూ ఆమె చెప్పినా ఆయన గట్టిగా నిలదీశారు. దీంతో ఆమె ఫోను స్విచ్ ఆఫ్ చేసింది. ఇలాంటి ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక వ్యాధులపై అవగాహన ఉన్నప్పుడే పూర్తిగా నిర్మూలించే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం మొబైల్ ఐఈసీ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ లెప్రసీ, టీబీ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎయిడ్స్, లెప్రసీ, టీబీ వ్యాధులకు సంబంధించిన ప్రచార పుస్తకాలు, పత్రికలను ఆవిష్కరించారు. వైద్యాధికారులు శైలజ, కోటిరెడ్డి, సురేంద్ర, మంజునాథ్, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రాధాన్యతతోనే సాధికారత సాకారం

- మహిళా ప్రజాప్రతినిధుల వాణి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ముఖ్యం..ఆర్థికంగా, సామాజికంగా వారికి సమాన హక్కులు కల్పిస్తే ఇది సాధ్యం.. దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో భూమిక మరింత పెరగాలి. అప్పుడే భారతావనిలో మహిళా సాధికారత సాకారమవుతుంది. తిరుపతిలో రెండోరోజు(సోమవారం) జరిగిన జాతీయ మహిళా సాధికారత సమావేశంలో పాల్గొన్న పలువురు మహిళా ప్రజాప్రతినిధులు వ్యక్తం చేసిన అభిప్రాయాలివి..వారేమన్నారంటే...



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మహిళా ప్రజాప్రతినిధులు

అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి



రాజకీయంగానే కాకుండా ఇతర రంగాల్లోనూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు ప్రాధాన్యత కల్పించాలి. ప్రస్తుతం మైనార్టీ మహిళలు కూడా మరింతమంది రాజకీయాల్లోకి రావడం శుభపరిమానం. ఆ దిశగా వారు ముందుకు రావడం అభినందనీయం. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు మహిళలకు అగ్రాసనమేస్తున్నారు. ఇలాంటి సదస్సులు మహిళలు మరింత ముందుకు సాగడానికి ప్రేరణనిస్తాయి.

\- జకియాఖానం, ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్

తీర్మానాలు అమలైతేనే సార్థకత



జాతీయ సాధికారత సదస్సులో మహిళాభ్యున్నతికి చేసిన తీర్మానాలను చట్టసభలో కూడా ఆమోదించాలి. వాటిని అమలు చేయాలన్నారు. అపుడే వాటికి సార్థకత లభిస్తుంది. పంచాయతీ నుంచి అసెంబ్లీ వరకు మహిళకు రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. ఆడబిడ్డల భవిష్యత్తుకు ప్రభుత్వాలు మరన్ని చట్టాలు తెవాల్సి ఉంది. ఈ శతాబ్దంలో కూడా మహిళలు తమ సమస్యలపై పోరాడాల్సి వస్తోంది.

\- తారహై కుత్‌బ్రెట్, ఎమ్మెల్యే, తమిళనాడు

సదస్సు చరిత్రలో ఓ మైలురాయి



మహిళాభివృద్ధికి తొలిసారిగా జాతీయ మహిళ సాధికారత సదస్సు నిర్వహించడం శుభపరిణామం. ఇది చరిత్రలో ఓ మైలురాయిలా నిలుస్తుంది. కేరళలో మహిళా అభివృద్ధికి అక్కడి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టింది. పురుషులతో పోలిస్తే మహిళ అక్షరాస్యత శాతం కూడాఎక్కువే. మహిళలు మరింత ఎదగాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి.

\- ప్రతిభ, మహిళసాధికారత చైర్‌పర్సన్,కేరళ

మరిన్ని పథకాలు అవసరం



మహిళల రక్షణ, స్వావలంబనకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మరిన్ని పథకాలు తేవాలి. విద్యా,ఆర్థిక, నైపుణ్యాభివృద్ధితోనే మహిళా సాధికారత కల సాఫల్యమవుతుంది. చిన్నప్పటి నుంచి విద్య అందించడం, లింగ వివక్షత రూపుమాపడం, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయ సామాజిక రంగాల్లో మహిళలు రాణించడానికి వీలవుతుంది. కేరళలో మహిళలు కూడా వందశాతం అక్షరాస్యత సాధించారు.

\- శాంతకుమారి, కొంగడ్ ఎమ్మెల్యే, కేరళ

మహిళా ఎమ్మెల్యేల సంఖ్యే సాధికారతకు దర్పణం



మహిళలను ఒక శక్తిగా చూడాలన్నది సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 22మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉండటం చంద్రబాబు దార్శనికతకు దర్పణం. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఎదిగితేనే సాధికారత సాకారమవుతుంది. ఈ దిశగానే రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది.

\- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే

సదస్సుతో సాధికారతకు బాట



తొలిజాతీయ మహిళా సాధికారత సదస్సు తిరుపతి కేంద్రంగా నిర్వహించడం గర్వకారణంగా ఉంది. ఈ సదస్సులో చేసిన తీర్మానాలు మహిళాలోకానికి ఎంతగానో ఉపయోపడతాయి. మహిళలకు అధికారం, ఆర్థికంగా ఎదగడానికి సదస్సు బాటలు వేస్తుంది. సదస్సు నిర్వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు.

\- ఎ.మధుసూదన్, ఎమ్మెల్సీ

సూపర్‌సిక్స్‌లో నాలుగు స్త్రీలకే..



మహిళ సాధికారతను కూటమి ప్రభుత్వం ఆచరణ సాధ్యం చేస్తోంది. సీఎం చంద్రబాబు ఈ విషయంలో నిబద్ధతతో పనిచేస్తున్నారు. అందుకు పథకాల్లో మహిళలకే పెద్దపీట వేస్తున్నారు. సూపర్‌సిక్స్‌లో నాలుగు పథకాలు మహిళలకే కేటాయించిన ఘనత చంద్రబాబుకు దక్కింది. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వడం సంతోషం.


\- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే







సదస్సు గురుతులు : సదస్సుకు హాజరైన డెలిగేట్ల సెల్ఫీ - ఫొటో తీసుకుంటూ - శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు



శ్రీవారి ఆలయంలో నవీన్‌చంద్ర రాంగులామ్ దంపతులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్ తదితరులు

కృతజ్ఞతలు తెలపడానికి వచ్చా

- సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమానికి మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర



మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రకు బొట్టు పెడుతున్న గురువానంద

రామచంద్రాపురం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): 'సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమ పీఠాధిపతి గురవానంద గురూజీ ఆశీర్వాదంతోనే నేను నాలుగోసారి మారిషస్ ప్రధానినయ్యా. అందుకు కృతజ్ఞతలు తెలపడానికి ఆశ్రమానికి వచ్చా' నని నవీన్‌చంద్ర రాంగులామ్ చెప్పారు రామచంద్రాపురం మండలం సి.రామాపురం సమీపంలోని బ్రహ్మర్షి గురూజీ సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమాన్ని సోమవారం మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులాం, వీణా రామ్‌గులాం దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరు 15న మారిషస్‌లో తాను గురువానంద గురూజీని కలవగా, నవంబరు 13లోపు ప్రధానమంత్రి అవుతావని చెప్పారన్నారు. ఆ ప్రకారం కావడంతో ఆశ్రమానికి వచ్చి ఆయన్ను కలిశానని తెలిపారు. నవీనచంద్ర చేపట్టిన ప్రజాసేవకు గుర్తింపుగా ఇప్పటికే నాలుగు పర్యాయాలు మారిషస్ ప్రధానమంత్రి అయ్యారని గురువానంద గురూజీ తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాన రాజ్యసభ సభ్యుడు రవిచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులున్నారు. అనంతరం మారిషస్ ప్రధాని దంపతులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరగా జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, శాంతిలాల్, సరళ, ఆసీస్‌మెహతా తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం నవీన్‌చంద్ర దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

అడవిలో మృతదేహాలపై వీడని మిస్టరీ

హత్య కోణంలోనూ అనుమానాలు ● రెండు గోతుల్లో ఏముందో తేలేది రేపే





మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పాకాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనపాకం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఇద్దరి వ్యక్తుల మృతదేహాల గుర్తింపులో చిక్కుముడి వీడలేదు. ఇక్కడి అడవిలో రెండు మృతదేహాలను ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చిన విషయం తెలిసిందే. సీఐ సుదర్శన్ ప్రసాద్, తహసీల్దార్ సంతోష్ సాయి, సిబ్బంది సోమవారం వెళ్లి పరిశీలించారు. చెట్టుకు వేలాడుతున్న పురుషుడి మృతదేహాన్ని కిందికి దించారు. దీనితోపాటు అక్కడే కిందఉన్న మహిళ మృతదేహానికి సాయంత్రం వైద్యులు అక్కడే పోస్టుమార్టం చేశారు. ఇవి కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటతో అక్కడే ఖననం చేశారు. ఫోరెన్సిక్ క్లూస్ టీమ్ పరిసరాల్లో ఆనవాళ్లు సేకరించింది. కాగా పక్కనే రెండు గోతుల్లో చిన్నారుల మృతదేహాలు ఉన్నాయని భావిస్తున్నారు. గుంతలు తవ్వేందుకు ప్రయత్నించేలోగానే చీకటి పడింది. మంగళవారం తవ్వి పరిశీలించనున్నారు. మృతులు తమిళనాడు తంజావూరుకు చెందిన వారుగా భావిస్తున్నారు. తంజావూరుకు చెందిన కళైసెల్వన్ అనే మానసిక వైద్యుని వద్ద మేలో చికిత్స తీసుకున్న ప్రిస్క్రిప్షన్ సంఘటనా స్థలంలో లభించింది. అంతకుమించి ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని పోలీసులు తెలిపారు. మహిళ, పురుషుడి నోట్లో గుడ్డలు, గ్లౌజులు కుక్కి, నోటికి ప్లాస్టర్ వేసి ఉంది. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చి చెట్టుకు ఉరివేశారా, ఇక్కడే చంపేశారా అనేది మిస్టరీగా ఉంది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 21 దుంగలు స్వాధీనం



మంగళం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీఎన్‌పాళెం అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్ ఆధ్వర్యంలో విష్ణుకుమార్ బృందం అటవీ సిబ్బంది చైతన్యకిషోర్‌తో కలిసి కూంబింగ్ నిర్వహించారు. టీఎన్‌పాళెం సమీపంలోని షాపింగ్‌మాల్ వెనుక వైపు కొందరు మూడు కార్లలో దుంగలు లోడ్‌చేస్తుండగా వెళ్లారు. వీరిని చూసి వారు చూసి పారిపోగా.. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. అతడు చిత్తూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. 19 వేర్లు, రెండు దుంగలను, స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వెలవెలబోయిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



ఖాళీగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15: నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే సబ్‌రిజిస్ట్రార్ కార్యాయలం సోమవారం బోసిపోయింది. దస్తావేజులు, రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి డ్యాకుమెంట్ రైటర్లు మూడు రోజులపాటు పెన్‌డౌన్ చేపట్టారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సుమారు 72 స్లాట్లు నమోదవుతాయి. డ్యాకుమెంట్ రైటర్ల పెన్‌డౌన్‌తో పాటు సర్వర్ నెమ్మదిగా ఉండడంతో ఆరు స్లాట్లు మాత్రమే జరిగినట్లు సిబ్బంది తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలను నిలుపుదల చేయాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బందకి సాహెబ్, జోగి శివకుమార్, కొళ్లపూడి సుబ్బయ్య, ప్రసాద్, చంద్రయ్య, మణి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్‌షూటింగ్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభచాటిన విద్యార్థినులు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రైఫిల్‌షూటింగ్ పోటీలకు గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో అండర్-14 బాలిక విభాగంలో తమ పాఠశాలకు చెందిన తేజస్వి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం, ఈప్సితశ్రీ జిల్లాస్థాయిలో మూడో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో కోచ్ జయశంకర్, పీడీలు కరీముల్లా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించాయన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైములను వెంటనే పరిష్కరించాలని, కార్మిక సంక్షేమ చట్టం నుంచి కార్మికులకు నిధులు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, మీరాబాయ్, రమేష్, సునీల్, వెంకటయ్య, మస్తాన్, రవీంద్ర, జిలానీ, పురుషోత్తం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా: జనసేన



సమావేశంలో జనసేన నాయకులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా అని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ సవాల్ విసిరారు. సోమవారం స్థానిక జనసేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను మానుకోవాలని, అసత్య ప్రచారాలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్, నాగార్జున, మనోజ్, కార్తీక్, మధు, సాయికిరణ్, శీను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు

బాలాయపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని వెంకటగిరి డీఆర్‌వో సుహాసిని హెచ్చరించారు. సోమవారం మండలంలోని మన్నూరు, పల్లిపాడు గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వు ఫారెస్ట్ భూముల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ప్రవేశించినా, భూములను ఆక్రమించిన చర్యలు తీసుకుంటామన్నారు. మన్నూరులో సర్వే నంబరు 92, పల్లిపాడులో సర్వే నంబరు 53, 54-20, 54-21, 55-2, 56-2, 59లోని భూములు అటవీశాఖ పరిధిలో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో వన్య ప్రాణులను వేటాడటం, ఉచ్చులు వేయడం, విద్యుత్ తీగలు తీయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదర్శనీయుడు మోక్షగుండం

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యుడు రియాజ్ అహ్మద్, గిరినాథ్, శ్రీనివాసులు, చైతన్య కుమార్, శ్రీనివాసులురెడ్డి, శీనయ్య, ఇలియాజ్ అహ్మద్, రమణయ్య, మురళీరెడ్డి, జగదీష్, రవిచంద్ర, సద్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

17న బాలాయపల్లి మండల మీట్

బాలాయపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 17వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు స్కూల్‌గేమ్స్

చిల్లకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళ, బుధవారాల్లో మండలస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు హెచ్ఎం జ్యోతి తెలిపారు. డీవైఈవో సనత్ కుమార్, ఎంఈవో రఫూఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లో పోటీలను నిర్వహిస్తామని, ప్రతిభ చూపిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

స్టేడియం అభివృద్ధికి కృషి: పాశిం



నూతనంగా నిర్మించిన గ్యాలరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ ప్రతినిధులు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్టేడియంలో జిందాల్ కంపెనీ సహకారంతో నూతనంగా నిర్మించిన గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, దాతల సహకారంలోరూ.50లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కలెక్టర్ నిధుల నుంచి రూ.17 లక్షలతో నూతన ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు దాతల సహకారంతో ఆధునాతన జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా జిందాల్ కంపెనీ సహకారంతో నూతన గ్యాలరీ, పెన్నార్ కంపెనీ సహకారంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు సహకారంతో త్వరలోనే స్టేడియంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, రజినీకాంత్, సుమన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, లవకుమార్, దీపక్ ఆకాష్, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్ కుమార్, పెంచలయ్య, జిందాల్ కంపెనీ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల అనుమతితోనే పనులు చేపట్టాలి



కౌన్సిలర్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్ పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఏ ప్రాంతంలో అయినా సరే తప్పనిసరిగా మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకొని పనులు చేపట్టాలని ఛైర్ పర్సన్ కటకం దీపిక స్పష్టం చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవనంలో ఛైర్ పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన 16 అంశాలతో కూడిన అజెండా గురించి చర్చించారు. 14 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే టేబుల్ అజెండాలో పొందుపరచిన నాలుగు అంశాలను ఆమోదించారు. మున్సిపాలిటీ పరిధిలో ఇష్టానుసారంగా రోడ్లు తవ్వేసి, అలాగే వదిలేస్తున్నారని, అందుకు కారకులైన గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకొని పనులు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని ఛైర్ పర్సన్ అన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీటీసీ ప్రిస్కిల్లా

పెళ్లకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా అన్నారు. సోమవారం చెంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో చెంబేడు, తాళ్వాయిపాడు, రోసనూరు ఉన్నత పాఠశాలలకు చెందిన బాలబాలికుల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో-2 మించల శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, పీఈటీ మాధవయ్య, మల్లిక, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు ఎంపీడీవోగా సాయిప్రసాద్



వాకాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఎంపీడీవోగా సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఉమామహేశ్వరరావు చిట్టమూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం నెల్లూరు జిల్లా పరిషత్ సీఈవో మోహన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు.

నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డిని దేవదాయశాఖ సహాయ కమిషన్ ప్రసన్నలక్ష్మి ఆహ్వానించారు. సోమవారం మావిళ్ల పాడులోని ఆయన ఇంటికెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్య క్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సూళ్లూరుపేట - చెన్నై మార్గంలో అక్కంపేట రైల్వేస్టేషన్ సమీపంలో 74/29-31 కిలోమీటరు మధ్య సుమారు 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం పడి ఉందంటూ రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ సమీపంలోని సాయినగర్ వద్ద రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు సమాచారం మేరకు... చెన్నై వైపు వెళ్లే రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చునని అనుమానునిస్తున్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. సిమెంట్ కలర్ చొక్కా, తెలుపు నీలిరంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్ఐ చెన్నకేశవ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

డక్కిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగవోలు, దేవునివెల్లంపల్లి గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువైద్య శాస్త్రవేత్త శ్రీహరి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పశువులకు తీవ్రజ్వరం, నోటి నుంచి చొంగ కారడం, నోరు, కాలిగిట్ల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలు, దీనివల్ల పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పశువైద్యాధికారి శ్రీహరి, సహాయ సంచాలకుడు కిశోర్‌కుమార్, పశువైద్య సహాయ శాస్త్రవేత్త రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించండి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని నెల్లటూరు, కొండాగుంట, తిప్పవరప్పాడు గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. నెలరోజుల పాటు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని అర్బన్ సీఐ బాబి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని చలివేంద్ర వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

జీతాలు చెల్లించాలని ధర్నా

తడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ కార్మికులు సోమవారం ధర్నాకు దిగారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఇమ్ఫ్యులామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఈ ఏడాది జూన్ నుంచి కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం సాయంత్రం కార్మికులు గేట్ ముందు ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని యాజమాన్యంతో చర్చించారు. నెలాఖరులోగా బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించి విధులకు హాజరయ్యారు.

అదుపుతప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొన్న బస్సు

గూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మనేటూరు గ్రామ సమీపంలో సోమవారం ఓ ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికుల వివరాల మేరకు... వెంకటగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గూడూరు నుంచి వెంకటగిరికి ప్రయాణికులతో వెళుతుండగా కొమ్మనేటూరు సమీపంలో అకస్మాత్తుగా మోటారు సైకిల్ అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌ను, దుకాణాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. బస్సు ముందుభాగం దెబ్బతింది.

ఉపాధ్యాయుల నిరసన

వెంకటగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు కొత్త పీఆర్సీని నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సుశీలమ్మకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరామ్, సుబ్రహ్మణ్యం, కృష్ణ, భాస్కర్ యాదవ్, రామసుబ్బయ్య, నాగమోహన్, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 33 మందికి సీఎం సహాయనిధి నుంచి రూ.21.38 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

ప్రహరీ కూల్చివేత దారుణం

కోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి దళితవాడలో వైసీపీ ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర ఇంటి ప్రహరీని దౌర్జన్యంగా కూల్చివేయడం దారుణమని ఆ పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సురేంద్ర పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున ఓర్వలేక స్థానికంగా ఉన్న కొంత మంది నాయకులు ఆయన ఇంటి ప్రహరీని అక్రమంగా కూల్చివేయడం దుర్మార్గమన్నారు. సురేంద్ర కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండగా ఉంటుందని సంపత్‌కుమార్‌రెడ్డి అన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఇంజనీర్స్ డే



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు

కోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు టెక్నికల్ క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరానికి వెళ్లే దారి ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సత్యసాయి స్పిరిచువల్ సొసైటీ సభ్యులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక కుమ్మర వీధిలోని సత్యసాయిబాబా మందిరానికి వెళ్లే మార్గాన్ని కొందరు ఆక్రమించుకుని ఆటకం కలిగిస్తున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటసురేష్, దాము, ప్రతాప్, ఆనంద్, మల్లికార్జున్‌రావు, శేషగిరిరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలు

తడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలు సోమవారం మొదలయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో సోమవారం కలశస్థాపన, పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం కుంభాభిషేకం జరగనుంది.

పుత్తూరు వార్తలు

కష్టపడే వారికి సముచిత స్థానం



తిరుపతిలో ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న మునిరత్నం తదితరులు

వడమాలపేట,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధి కోసం కష్టపడే వారికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్‌గా నియమితులైన ఎస్. మునిరత్నం ఎమ్మెల్యేను సన్మానించారు. సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో నాయకులు ధనంజయులు నాయుడు, అబ్బరాజు, దాము యాదవ్, వెంకటయ్య, సుబ్రమణ్యం రెడ్డి, మణిరాజు, చలపతి యాదవ్, నాగరాజు, కుమార్, దేవ, శివరాయల్, పెద్దబ్బ రాజు, రవి నాయుడు, రవిరెడ్డి, గణపతి, రాధాకృష్ణమ రాజు తదితరులతో కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వడమాలపేట క్రీడాకారులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన తనుష్, వినయ్

వడమాలపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన బాక్సింగ్ అండర్ -14, 17, 19 బాల బాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో వడమాల పేట విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. తిరుచా నూరులో జరిగిన ఎంపికల్లో వడమాల పేట ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 విభాగంలో తనుష్, వినయ్‌కుమార్ ఎంపికయ్యారు. అక్టోబర్ మొదటి వారంలో విజయనగరంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

మండలస్థాయి క్రీడా ఎంపికలు



మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎస్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. సోమవారం ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు ప్రారంభించారు. మండల స్థాయి పోటీలలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని కొనియాడారు. క్రీడలలో ప్రతిభను కనబరిచి డివిజన్ స్థాయిలో రాణించాలన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచి క్రీడలతో పాటు చదువులోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. గెలుపు ఓటమిలను సమంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 బాలసుబ్రమణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అధ్యాపకులు ఏకాంబర ఆచారి, ఎస్ఆర్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, మండల కో ఆర్డినేటర్ గోపికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, గుర్రప్ప, వేలు, సుబ్రమణ్యం, కేశవులు, మోహన్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో చోరీ



ధ్వసమైన గడియ - సంఘటనా స్థలంలో చిందరవందరగా పడివున్న బట్టలు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వెళ్లిన పట్టణంలోని ఆచారి వీధికి చెందిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ ఓబయ్య తెలిపిన వివరాలు... వెంకటసాయి ప్రసాద్ స్థానిక ఫెర్టిలైజర్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఆయన తన భార్య మమత, ఇద్దరు కుమార్తెలతో కలిసి శుక్రవారం తిరుమలకు వెళ్లారు. తిరుమల నుంచి నేరుగా గొల్లపల్లిలోని అత్తగారింటికి వెళ్లారు. సోమవారం ఉదయం 8.30 గంటలకు ఆచారి వీధిలోని తన నివాసానికి చేరుకున్నాడు. ఇంటి తలుపులు ధ్వంసం చేసి ఉండడాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో బట్టలు చిందవంద రగా పడి ఉండటంతో ఆందోళనకు చెందారు. ఇంట్లో దాచిన 100 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు పిర్యాదు చేశారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది.

ఇళయరాజాకు రోజా అభినందనలు



కుటుంబీకులతో కలిసి ఇళయరాజాను అభినందిస్తున్న మాజీ మంత్రి రోజా

నిండ్ర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాను మాజీ మంత్రి రోజా అభినందించారు. 50 ఏళ్ల సంగీత ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ను స్వగృహంలో సోమవారం తన కుటుంబీకులతో వెళ్లి సత్కరించి, అభినందనలు తెలిపారు. తమ చిత్రరంగ ప్రవేశం ఇళయరాజా సంగీతంతోనే ప్రారంభమైందని రోజా, సెల్వమణి దంపతులు గుర్తు చేసుకున్నారు. ఇళయరాజా గోల్డెన్ హ్యాండ్ వల్లే తాము ఇంతగా ఎదిగామని సంతోషం వ్యక్తం చేశారు. రోజా కుమారుడు కృష్ణకౌశిక్‌ను ఈ సందర్భంగా ఇళయరాజా ఆశీర్వదించారు.

బాధితులకు అండగా ఉంటాం

పిచ్చాటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే ఆదిమూలం భరోసా ఇచ్చారు. సోమవారం ఉదయం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన ముగ్గురు బాధితులకు రూ.1.20 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో పిచ్చాటూరుకు చెందిన ఓ.కృష్ణయ్యకు రూ.36,660, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కుక్కంబాక్కానికి చెందిన ఎన్.మునస్వామికి రూ.68,987, వరదయ్యపాళెం మండలం కదూరుకు చెందిన సి.గురవయ్యకు రూ.14,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పిచ్చాటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నేతలు పద్దురాజు, వాసురెడ్డి, డిల్లీబాబు, శ్రీనివాసులురెడ్డి, సర్వశిక్షా అభియాన్ పీడీ గౌరిశంకర్, పీవో చంద్రశేఖర్, ఎంఈవో హేమమాలిని, హెచ్‌ఎం గిరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డీఏలను వెంటనే విడుదల చేయాలి: ఏపీటీఎఫ్


వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపిన అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అడిట్ సభ్యుడు వెంకటాద్రి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు, విద్యార్థులకు భారంగా మారిన స్టూడెంట్ అసైన్‌మెంట్లను, యాప్‌లను పరిమితం చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. శ్రీకాళహస్తి పట్టణ, మండలం, తొట్టంబేడు, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, పెళ్లకూరు మండలాల ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన క్రీడా పోటీలు

రేణిగుంట సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలానికి చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవో- 2 రంగనాథ్, పీడీలు, పీఈటీలు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మారిషస్ ప్రధానికి ఘన వీడ్కోలు


తిరుపతి విమానాశ్రయంలో మారిషస్ ప్రధానికి వీడ్కోలు పలుకుతున్న జిల్లా ఎస్పీ

రేణిగుంట సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్రకు ఘన వీడ్కోలు పలికారు. ఒకరోజు పర్యటనలో భాగంగా ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయన బ్రహ్మ రిషి ఆశ్రమాన్ని సందర్శించిన అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గాన రాత్రి 7 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో మారిషస్‌కు వెళ్లారు.

రేపు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక గాలివీధిలోని కాళికా పరమేశ్వరి ఆలయంలో ఈనెల 17వ తేదీన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు స్వర్ణకారుల సంఘం నాయకులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడుతూ మహోత్సవంలో భాగంగా విశ్వకర్మకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం విశ్వకర్మ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంతకు ముందు ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు ఎం.కార్తీక్ ఆచారి, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శి శివాచారి, ఆర్.రమేష్, పళని, వెంకటేష్, బాబు, వాసు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చివోలు, ఓబులాయపల్లి, అక్కుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పేద మెరిట్ విద్యార్థులు సుమారు 60మందికి స్కూల్‌మేళా స్వచ్ఛంద సంస్థ సోమవారం విద్యాసామగ్రి పంపిణీ చేసింది. ముచ్చివోలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శర్మ, ప్రియదర్శిని, చందన తదితరులు పాల్గొన్నారు.

చౌకదుకాణ డీలర్లకు కొత్త ఈ- పోస్ మెషిన్ల పంపిణీ

సత్యవేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు చెందిన 126 మంది చౌకదుకాణ డీలర్లకు కొత్త ఈ-పోస్ మెషిన్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో మెషిన్లను అందించారు. ఇది వరకు వినియోగిస్తున్న ఈపోస్ యంత్రాలు తరచూ మరమ్మతులకు గురికావడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కార్డుదారులు గంటల తరబడి చౌకదుకాణాల వద్ద వేచిఉండే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఈ పోస్ మెషిన్లు అధునాతన సాంకేతికతో తయారు చేశారని ఇంజనీర్ వీరేంద్ర తెలిపారు. కాగా సత్యవేడు మండలానికి 55 మెషిన్లు, వరదయ్యపాళెంకు 43, బీఎన్‌కండ్రిగకు 28 మెషిన్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు.


ఈ-పోస్ మెషిన్లను అందుకుంటున్న చౌకదుకాణ డీలర్లు

పీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్‌గా ద్వైత

వరదయ్యపాళెం, సెప్టెంబరు 15: వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ద్వైత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఉదయ్‌కుమార్ ఇటీవల బదిలీపై వెళ్లారు. అదేవిధంగా బదిలీపై ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ జగదీష్ నాయక్ కూడా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఇద్దరినీ ఆస్పత్రి సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

సత్యవేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏపీఎన్జీవో జిల్లా అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ సురేష్‌బాబు కోరారు. సత్యవేడు ఎన్జీవో భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులకు దసరాకు ఒక డీఏను ప్రకటించాలన్నారు. నూతన పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రఘు, లలిత్‌కుమార్, శామ్యూల్, ఓం ప్రసాద్, ముత్యాలయ్య, నితిన్, వినోద్, కాంచన తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

కేవీబీపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రామ్‌నాయక్ చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరాలతో ఎక్కువమంది బాధపడుతున్నారని ఇది కేవలం వాతావరణంలో మార్పుల వల్లేనని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల్లో ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. కుటుంబంలో ఒకరికి జ్వరం వచ్చిందంటే అందరికీ ప్రబలుతుందన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశీ, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణమూర్తి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశీ, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణమూర్తి, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆమెను ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామిఅమ్మ వార్లను రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి హరి జవహర్ లాల్ దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం లడ్డూప్రసాదం పోటును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.


ఆలయం వద్ద దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్ - ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న హరి జవహర్‌లాల్

మహిళా ప్రజాప్రతినిధులకు కలంకారీ చీరలు


రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో చీరలు బహూకరిస్తున్న సుధీర్, రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరిగిన జాతీయ మహిళ సాధికారత సదస్సు సోమ వారం ముగిసింది. దీంతో మహిళా ప్రజాప్ర తినిధులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులు కలంకారీ చీరలను బహూకరించారు.

మృత్యుంజయుడికి వేదోక్తంగా పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించగా భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి


బాలసుబ్రమణ్యం (ఫైల్)

సత్యవేడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌ఆర్ అగ్రహారానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలసుబ్రమణ్యం (75) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగృహంలో సోమవారం మృతి చెందారు. బాలసుబ్రమణ్యంకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి సహా పలువురు టీడీపీ నేతలు, రాజకీయ నాయకులు బాలసుబ్రమణ్యం భౌతికకాయానికి నివాళులర్పించారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వరి పంటకు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధర కల్పించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండలంలో పలువురు రైతులను కలిశారు. రైతులే దేశానికి వెన్నెముక అని కానీ నేడు వారు తమ పంటలకు గిట్టుబాటు ధరలేక నష్టపోతున్నారన్నారు. సురేంద్రరెడ్డి, ఆంటోని, నవీన్, నాగరాజు, మహేష్, సంతోష్, జోసెఫ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్ నగర్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. చిన్నారు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. హిందీ భాష గొప్పతనాన్ని తెలిపేలా అనేక రకాల వ్యాకరణాంశాలు, గేయాలు, కవితలు, పద్యాలను చదివి వాటి అర్థాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ రూపాదేవి, ఏజీఎం, డీన్ త్రివేణి, ఇన్‌చార్జీలు కల్పన, శ్రీహరి, వంశీ, ఉపాధ్యాయులు షేక్ అహ్మద్ తాజ్, భువనేశ్వరి, మంజు పాల్గొన్నారు.

పంట కాలువ ఆక్రమణలు తొలగించండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాలేడు చెరువు నుంచి సుగ్గుపల్లి చెరువుకు వచ్చే పంట కాలువ ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ శ్రీదేవిని రైతులు కోరారు. పెద్దపాలేడుకు చెందిన కొందరు రైతులు సుగ్గుపల్లి చెరువుకు వచ్చే పంట కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారన్నారు. ఆక్రమణలపై గతంలో అర్జీలు ఇచ్చామని ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదన్నారు. పంట కాలువ ఆక్రమణ వల్ల ఎగువ నుంచి వచ్చే నీరు చెరువులోకి రావడం లేదని తెలిపారు. వీఆర్వో, సర్వేయరును పంపి కాలువ సర్వే చేయిస్తామని తహసీల్దార్ చెప్పారు.

మహాబలిజ సమ్మేళనంలో పసుపులేటి నవీన్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఐకాన్10 -2025 మహాబలిజ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి శ్రీకాళహస్తి నుంచి బలిజ నాయకులు పసుపులేటి నవీన్‌కుమార్, దండి నరేంద్ర హాజరయ్యారు. వారు సమాజంలో యువత పాత్ర, అభివృద్ధి, సంఘ ఐక్యతపై ప్రసంగించారు. పలువురుని వారి ప్రసంగం ఆకట్టుకుంది. కాగా ఈ సమ్మేళనంలో బలిజసామాజిక పురోగతిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

రీ సర్వే పక్కాగా నిర్వహించండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేను పక్కా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమ వారం సచివాలయ సర్వేయర్లతో ఆమె సమీక్షించారు. ముందుగా గ్రామాల్లో హద్దులు గుర్తించిన తరువాతే సర్వే చేప ట్టాలన్నారు. రైతుల సమక్షంలో రీ సర్వేను ఎటువంటి తప్పి దాలు లేకుండా చేయాలన్నారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో పీజీఆర్‌ఎస్‌లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ చెప్పారు. కుమార వెంకటాపురం, చిన్నాయగుంట, తిమ్మభూపాలపురం గ్రామా ల్లో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. రెండోవ విడతలో తెర్రి పాడు, చల్లమాంబపురం, తంగేళ్లపురం, నీర్పాకోట, తలారి వెట్టు, వీఎస్‌పురం, తలారివెట్టు, వీఎస్‌పురం, కంచనపుత్తూ రు, కనమనంబేడు, బీఎస్‌పురంలలో రీ సర్వే చేయాలన్నారు.

గుడిమల్లంలో ప్రముఖుల సందడి

ఏర్పేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామిని సోమవారం విశేష సంఖ్యలో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు దర్శించుకున్నారు. అందులో ప్రధానంగా పార్లమెంటు డిప్యూటీ డైరెక్టర్ అంకితపాండే, కుటుంబసమేతంగా దర్శించారుకున్నారు మినరాని సర్కార్, అంత్రసర్కార్, ఎమెల్యే కమిటీ సభ్యులు కూడా దర్శించుకున్నాఉ. అదేవిధంగా ఉమెన్ ఎంపవర్‌మెంట్ నేషనల్ కాన్ఫరెన్సు మెంబర్లు విశేష సంఖ్యలో గుడిమల్లంను దర్శించుకున్నారు. వీరికి ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


విజయలక్ష్మి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీడీవోగా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేస్తున్న సుబ్రహ్మణ్యం గత ఏడాది పదవీ విరమణ చేయడంతో కార్యాలయంలో ఏవోగా పని చేస్తున్న ప్రసాద్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో పెళ్లకూరు మండలం ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి పదోన్నతిపై ఎంపీడీవోగా ఇక్కడికి బదిలీ అయ్యారు.

నేడు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపికలు

ఏర్పేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-14, 17, బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా విభాగాల్లో ఎంపికలు జరిపి మండలస్థాయి జట్లను ఎంపిక చేస్తామని ఎంఈవోలు ప్రేమలత, 18న పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో అథ్లెటిక్స్, చెస్, బ్యాడ్మింటన్, యోగా ఎంపికలు జరుగుతాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరదయ్యపాళెంలో రేపటినుంచి...

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం జడ్పీ హైస్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్న ఎంఈవో సరస్వతి తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా ఆంగ్ల ఉపాధ్యాయుడు


సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యం రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. గుంటూరు విట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఇండక్షన్ ట్రైనింగ్‌కు ఈయన హాజరుకానున్నారు. డీఎస్సీ 2025 ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి సుబ్రహ్మణ్యంను రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా ఎంపిక చేశారని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజవేలు తెలిపారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా నేడు మహేష్‌రెడ్డి ప్రమాణ స్వీకారం


మహేష్ రెడ్డి

ఏర్పేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 16న మంగళవారం ఉదయం 11గంటలకు అంజిమేడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి కుమారుడు కందాటి మహేష్ రెడ్డి ఏర్పేడు సింగిల్‌విండో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ హాజరు కానున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి


వినతిపత్రం అందిస్తున్న నాగరాజునాయుడు

ఏర్పేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవరం పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డిక్సన్ కంపెనీ ప్రతినిధులను ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు కోరారు. సోమవారం పరిశ్రమ ప్రతినిధులను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సర్పంచ్ భూపతినాయుడు పాల్గొన్నారు.